క్లుప్తంగా

నేటి నుంచి జాతర



అయిజ: మండలంలోని కేశవరంలో ఈనెల 11 నుంచి 12వ తేదీ వరకు లక్ష్మీవేంకటేశ్వర స్వామి జాతర నిర్వహించనున్నారు. ఉత్సవాల సందర్భంగా మంగళవారం ఉదయం గంగపూజ, స్వామివారికి అభిషేకం, పల్లకీసేవ, మధ్యాహ్నం తీర్థ ప్రసాద వితరణ, సాయంత్రం ప్రభ ఊరేగింపు, రాత్రి భజన కార్యక్రమం ఉంటుందని ఆలయ కమిటీ పేర్కొంది. బుధవారం లక్ష్మీవేంకటేశ్వర స్వామి కల్యాణం, సత్యనారాయణ స్వామి వ్రతం, రాత్రి రథోత్సవం కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు పేర్కొన్నారు.

భూ సమస్యలు పరిష్కరించాలి



ఇటిక్యాల: మండల నూతన తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన భద్రప్పను సోమవారం గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులు సన్మానించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆయన తహసీల్దార్‌ను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు రుక్మేందర్‌రెడ్డి నాయకులు జయచంద్రారెడ్డి, జైపాల్‌రెడ్డి, మద్దిలేటి, రాజు, అల్లబకాష్, తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్‌కు సన్మానం

మానవపాడు: నూతనంగా తహసీల్దార్‌గా బాధ్యతలు తీసుకున్న జోషి శ్రీనివాస్‌శర్మకు సోమవారం గ్రంథాలయ జిల్లా చైర్మన్ నీలి శ్రీనివాసులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో జగన్మోహన్‌నాయుడు, నరసింహులు, ప్రభాకర్, పరమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

బీసీలకు అన్యాయం

గద్వాల: కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు తీరని అన్యాయం చేసిందని, తక్షణమే ప్రభుత్వం మరోసారి కుల గణనపై సర్వే చేయించాలని బీఆర్‌ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య అన్నారు. జనాభా లెక్కల్లో బీసీలను 22లక్షల మంది తగ్గినట్లు చూపడం దారుణమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి తక్షణమే బీసీలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

కులాంతర వివాహం.. జంటకు ప్రోత్సాహకం



గద్వాల: కులాంతర వివాహం చేసుకున్న వారికి ప్రభుత్వపరంగా ప్రోత్సాహం ఉంటుందని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో గద్వాల పట్టణానికి చెందిన కులాంతర వివాహం చేసుకున్న లక్ష్మి, సూర్యప్రకాష్ దంపతులకు రూ.2.50లక్షల ప్రోత్సాహకాన్ని అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ సంక్షేమశాఖ జిల్లా అధికారి సరోజ పాల్గొన్నారు.

'ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక' ప్రచారం మాత్రమే

మానవపాడు: మండలంలోని గోకులపాడులో ఏకగ్రీవంగా సర్పంచ్ ఎన్నిక అనేది అవాస్తవమని, దీనిపై గ్రామంలో ప్రచారం మాత్రమే నిర్వహించారని ఎంపీడీఓ భాస్కర్ తెలిపారు. సోమవారం గ్రామంలో గ్రామసభ నిర్వహించారు. గ్రామస్తుల సమక్షంలో అందరి అభిప్రాయాలు సేకరించారు. గ్రామంలో అభివృద్ధి కోసం ఏకగ్రీవం చేయాలని అనుకున్నామని, కానీ దానిపై నిర్ణయం తీసుకోలేదని గ్రామస్తులు ఎంపీడీఓకు వివరించారు.

శివాలయంలో ప్రత్యేక పూజలు



ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు శివుడికి అభిషేకం చేశారు. అనంతరం భక్తులు కొబ్బరికాయలు కొట్టి స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

ఓటరు జాబితా విడుదల



మల్దకల్‌లో ఓటరు జాబితా విడుదల చేస్తున్న ఎంపీడీఓ, అధికారులు

అలంపూర్ రూరల్: అలంపూర్ పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం సప్లమెంటరీ–2 డ్రాఫ్ట్ ఓటర్ జాబితాను ఎంపీడీఓ పద్మావతి విడుదల చేశారు. ఇందులో 68 మంది ఓటర్లను కొత్తగా నమోదు చేశామని, ఏమైనా తప్పులు ఉంటే సరి చూసుకోవాలని ఓటర్లకు ఎంపీడీఓ సూచించారు. గ్రామ పంచాయతీల్లో, ఎంపీడీఓ కార్యాలయంలో ఓటర్ల జాబితా అందుబాటులో ఉంటుందన్నారు.

నేడు జిల్లా కేంద్రంలో ఎన్నికల శిక్షణ

అలంపూర్ మండలానికి సంబంధించిన ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించి అధికారులకు శిక్షణ ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ పద్మావతి తెలిపారు. ఉదయం 11 గంటలకు జిల్లా కేంద్రంలోని ఐడీఓసీలో ఆర్‌ఓ, ఏఆర్‌ఓలకు శిక్షణ ఉంటుందన్నారు.

మల్దకల్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలకు సంబంధించిన నూతన ఓటరు జాబితాను సోమవారం ఎంపీడీఓ ఆంజనేయరెడ్డి, ఎంపీఓ రాజశేఖర్ పంచాయతీ కార్యదర్శులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆయా గ్రామ పంచాయతీల్లో నూతన ఓటరు జాబితా సిద్ధంగా ఉంటుందని ఓటర్లు చూసుకోవాలని సూచించారు. తుది ఓటరు జాబితాపై అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తేవాలని సూచించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ నర్సన్న, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ధరూరు: ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన ఓటరు లిస్టును ఎంపీడీఓ మంజుల విడుదల చేశారు. సోమవారం ఎంపీడీఓ కార్యాలయంలోని నోటీస్ బోర్డుపై లాంగ్ విత్ సప్లమెంటరీ 1, 2 లిస్టులను ప్రదర్శించినట్లు వారు తెలిపారు. 13న అన్ని రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించి, 15న తుది జాబితా విడుదల చేస్తామన్నారు.



ధరూరులో..



అలంపూర్‌లో ఎంపీడీఓ పద్మావతి

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఆత్మకూర్: ప్రభుత్వ కమ్యూనిటీ హెల్త్‌సెంటర్‌లో పనిచేస్తున్న కార్మికులకు 9 నెలలుగా వేతనాలు ఇవ్వకపోవడంతో పస్తులు ఉండాల్సిన పరిస్థితి దాపురించిందని తెలంగాణ మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి సురేష్, జిల్లా అధ్యక్షుడు శ్రీహరి అన్నారు. కార్మికుల వేతనాలు చెల్లించాలంటూ చేపడుతున్న దీక్షలు సోమవారం 6వ రోజుకు చేరుకున్నాయి. శానిటేషన్, పేషెంట్‌కేర్, సెక్యూరిటీ, సూపర్‌వైజర్ కార్మికులకు జీఓ 60 ప్రకారం రూ.15,600 ఇవ్వాల్సి ఉండగా.. అందులో కోతలు పెడుతూ కాంట్రాక్టర్ వెంకటయ్య అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. అనంతరం వైద్యాధికారి డాక్టర్ హరినారాయణ, డాక్టర్ నిస్సార్‌అహ్మద్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జిల్లాకార్యదర్శి మోష, కార్మికులు బాలరాజు, పార్వతమ్మ, నాగమ్మ, సత్తార్, భరత్, మోహినిద్దీన్, చెన్నమ్మ, బాలకిష్టమ్మ, శైలజ, వెంకటేష్, తిరుపతమ్మ, లక్ష్మి, అరుణ్‌కుమార్, యాదయ్య, రాబర్ట్, మోష తదితరులు ఉన్నారు.

కొత్త మండలాలు ఏర్పాటు చేయాలి



మాట్లాడుతున్న నాగర్‌దొడ్డి వెంకట్రాములు

గద్వాల: జిల్లాలోని గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో పెద్ద గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని అఖిలపక్షం నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం జిల్లా కేంద్రంలోని వాల్మీకి భవన్‌లో నూతన మండలాల ఏర్పాటుపై సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల, అలంపూర్ నియోజకవర్గాల్లో మల్దకల్ మండలంలోని బిజ్వారం, ఎల్కూర్, గట్టు మండలంలోని బలిగెర, మాచర్ల, మిట్టదొడ్డి, చాగదోణ, అయిజ మండలంలోని మేడికొండ, టీటీ దొడ్డి, ధరూరు మండలంలోని ఉప్పేరు, రేవులపల్లి, గద్వాల మండలంలో పూడూరు, అనంతపురం, కేటీ దొడ్డి మండలంలో నందిన్నె గ్రామాలను నూతన మండలాలుగా ఏర్పాటు చేయాలని కోరారు. నూతన మండలాలుగా ఏర్పాటు చేసే వరకు ఆయా గ్రామాలకు చెందిన ప్రజల భాగస్వామ్యంతో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చేలా పోరాటం చేయనున్నట్లు తీర్మానం చేసినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి ఈనెల 17వ తేదీన కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తామన్నారు. సమావేశంలో నాగర్‌దొడ్డి వెంకట్రాములు, బస్సు మోహన్‌రావు, ప్రభాకర్, కుర్వపల్లయ్య, అచ్చన్నగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీఎం శోభారాణి

ధరూరు: ప్రతి మహిళ మహిళా సంఘంలో సభ్యురాలిగా చేరి ప్రభుత్వం నుంచి అందే ప్రోత్సాహకాలను అందిపుచ్చుకొని ఆర్థికంగా అభ్యున్నతి సాధించాలని ఐకేపీ ఏపీఎం శోభారాణి అన్నారు. సోమవారం మండలంలోని ర్యాలంపాడు గ్రామంలో మండల మహిళా కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కొత్తగా పెళ్లి అయిన వారు గ్రూపుగా ఏర్పడి సంఘంగా ఏర్పడాలన్నారు. స్వయం సహాయక సంఘాల పని తీరు మరింత మెరుగుపరుచుకోవాలన్నారు. సంఘం సభ్యులకు ప్రమాద బీమా, వడ్డీ లేని రుణాలు, బ్యాంకు లింకేజీ వంటి రుణాలు అందించి ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు. కార్యక్రమంలో సీసీలు జయరాజు, నవీన్, రాఘవేంద్ర, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతు చేపట్టాలి



కోయిల్‌దిన్నె రోడ్డులో నిరసన చేపడుతున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: వడ్డేపల్లి మండలంలోని కోయిల్‌దిన్నె రోడ్డుకు మరమ్మతు చేపట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. రోడ్డు గుంతలమయంగా మారడంతో ప్రయాణం నరకంగా మారినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదంటూ కార్యకర్తలతో కలిసి సోమవారం నిరసన చేపట్టారు. ఎన్‌హెచ్ 44కు అనుసంధానంగా ఉన్న కోయిల్‌దిన్నె రోడ్డుకు ఐదేళ్లుగా మరమ్మతు చేపట్టకపోవడంతో మోటార్‌సైకిళ్లు, కార్లు వంటి చిన్న వాహనాలు గుంతల్లో అదుపు తప్పి ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈవిషయమై పంచాయతీరాజ్ శాఖ అధికారులు స్పందించి వెంటనే మరమ్మతు చేపట్టి వాహనదారుల ఇబ్బందులు తొలగించాలని కోరారు. త్వరగా పనులు చేపట్టకపోతే ఆయా గ్రామాల ప్రజలతో కలిసి ధర్నా చేపడతామని హెచ్చరించారు.

జీపీ వర్కర్లకు జీతాలు చెల్లించాలని వినతి



ఎంపీడీఓకు వినతిపత్రం అందజేస్తున్న ఐఎఫ్‌టీయు నాయకులు

మల్దకల్: మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల్లో పనిచేస్తున్న కార్మికులకు నెలనెలా జీతాలు ఇవ్వడంతో పాటు వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ ఐఎఫ్‌టీయూ గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి జమ్మిచేడు కార్తీక్ ఆధ్వర్యంలో సోమవారం మల్దకల్ ఎంపీడీఓ ఆంజనేయరెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జీఓ నంబరు 60 ప్రకారం గ్రామ పంచాయతీ సిబ్బందికి ప్రతి నెల 5వ తేదీ లోపు జీతాలు ఇవ్వాలన్నారు. ఏళ్ల తరబడి పనులు చేస్తున్న పంచాయతీ కార్మికులకు ఉద్యోగ భద్రత లేక ఆందోళనలో బతుకున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో భీమేష్, ఆంజనేయులు, సవారన్న, జయరాములు, నర్సింహులు, రంగన్న, రాములు తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల శిక్షణకు క్రీడాకారుల ఎంపిక



వెంకటేష్



సద్దాం

గద్వాలటౌన్: ఒడిశాలో ఈ నెల 21వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నిర్వహించే జాతీయ స్థాయి సీనియర్ కబడ్డీ పోటీల శిక్షణ క్యాంపునకు గద్వాలకు చెందిన క్రీడాకారులు వెంకటేష్, సద్దాం ఎంపికయ్యారని కబడ్డీ అసోసియేషన్ జిల్లా అధ్యక్షురాలు డీకే స్నిగ్ధారెడ్డి, ప్రధాన కార్యదర్శి నర్సింహ తెలిపారు. ఈ నెల 04వ తేదీ నుంచి 7 వరకు ఆదిలాబాద్ జిల్లాలో జరిగిన రాష్ట్రస్థాయి సీనియర్ బాలుర కబడ్డీ పోటీల్లో జిల్లా జట్టు తరపున వెంకటేష్, సద్దాం పాల్గొని అత్యంత ప్రతిభ కనబర్చడంతో సెలక్టర్లు జాతీయ స్థాయి పోటీల శిక్షణా శిబిరానికి ఎంపిక చేశారు. వీరి ఎంపికపై కబడ్డీ అసోసియేషన్ జిల్లా చైర్మన్ అబ్రహం, రవి, చందు, నగేష్, కరెంటు నర్సింహ, జగదీష్, రైల్వేపాష, రాజేందర్, వెంకటన్న, సురేష్, సీనియర్ క్రీడాకారులు హర్షం తెలిపారు.

గ్రంథాలయానికి పుస్తకాల వితరణ



ఇటిక్యాల: మండల కేంద్రానికి చెందిన బోయ శ్రీకాంత్ తన సొంత ఖర్చులతో రూ.6వేల విలువ గల పుస్తకాలను మండల గ్రంథాలయ శాఖకు సోమవారం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వివిధ పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే నిరుద్యోగ యువతి, యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇందులో గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–4 లకు సంబంధించిన పుస్తకాలు కూడా ఉన్నాయన్నారు. కార్యక్రమంలో రామకృష్ణారెడ్డి, నాగేశ్వర్‌రెడ్డి, గ్రంథాలయ సిబ్బంది మౌలాలి, తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల దుకాణం తనిఖీ



గట్టు: మండలంలోని మాచర్లలో సోమవారం వ్యవసాయ అధికారి హనుమంతురెడ్డి ఆగ్రో రైతు సేవా కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఆగ్రో రైతు సేవా కేంద్రంలో విక్రయించే ఎరువులకు సంబంధించి రైతుల ఆధార్ కార్డును ఈ–పాస్ మిషన్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని ఆదేశించారు. వీటితో పాటు రికార్డులను రాయాలని, ఎమ్మార్పీ ధరలకే ఎరువులను అందించాలని సూచించారు. అందుబాటులో ఉన్న ఎరువుల వివరాలను దుకాణం బయట నోటీస్ బోర్డులో ప్రదర్శించాలని సూచించారు. నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం అలవర్చుకోవాలి



పోటీల్లో గెలుపొందిన విద్యార్థులతో సైన్స్ అధికారులు

గద్వాలటౌన్: విద్యార్థులు శాస్త్రీయ దృక్పథం పెంచుకోవాలని జిల్లా సైన్స్ అధికారి భాస్కర్‌పాపన్న సూచించారు. జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం స్థానిక ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో ఫోరం ఫర్ ఫిజికల్ సైన్స్ టీచర్స్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వివిధ విభాగాల్లో ఆన్‌లైన్ మోడ్‌లో ప్రతిభా పరీక్ష పోటీలు నిర్వహించారు. ప్రతి మండలం నుంచి ఎంపిక చేసిన ముగ్గురు విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా.. గద్వాల ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థి శివసాయి, మానొదొడ్డి జడ్పీహెచ్‌ఎస్ విద్యార్థి పరశు, బీచుపల్లి రెసిడెన్షియల్ పాఠశాల నుంచి ఉపేంద్ర విజేతలుగా నిలిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరికి ప్రశంస పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశం గర్వించేస్థాయికి విద్యార్థులు ఎదగాలని, ఆ దృష్టితో విద్యార్థులు పరిశోధనలు సాగించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జహీరుద్దీన్, కృష్ణయ్య, శ్రీనివాసులు, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైద్య సేవలు అందుబాటులోకి తేవాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బీఎస్పీ నాయకులు

అలంపూర్: వంద పడకల ఆస్పత్రిలో వైద్య సేవలు అందుబాటులోకి తేవాలని బీఎస్పీ జిల్లా అధ్యక్షుడు రాంబాబు కోరారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్‌లో కలెక్టర్ సంతోష్‌కు బీఎస్పీ నాయకులు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అలంపూర్ చౌరస్తాలో ప్రజలకు వైద్య సేవలు అందించడానికి రూ. 21 కోట్ల వ్యయంతో వంద పడకల ఆస్పత్రి నిర్మించారన్నారు. గత ప్రభుత్వ హయాంలోనే ఆస్పత్రిని ప్రారంభించినప్పటికీ వైద్య సేవలు ప్రజలకు అందడం లేదని వాపోయారు. మూడు రాష్ట్రాల కూడలిగా ఉన్న అలంపూర్ చౌరస్తాలో వైద్య సేవలు లేకపోతే అత్యవసర పరిస్థితుల్లో ఎక్కడికి వెళ్లాలని ప్రశ్నించారు. ఆస్పత్రిలో సౌకర్యాలు కల్పించాలనే కారణంతో కాలయాపన చేయడం వలన ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు దృష్టిసారించి వంద పడకల ఆస్పత్రిలో వైద్య సిబ్బందిని నియమించి ప్రజలకు వైద్య సేవలు అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మణికుమార్, శశివర్మ తేజ, దేవన్న, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.

'బీసీ' వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి



మాట్లాడుతున్న రామకృష్ణ

అయిజ: ప్రభుత్వం ఇటీవల నిర్వహించిన కులగణన సర్వేలో బీసీల జనాభాను తక్కువ చేసి చూపించారని, బీసీల వ్యతిరేకి సీఎం రేవంత్‌రెడ్డి అని బీఆర్‌ఎస్ యువజన విభాగం నాయకుడు రామకృష్ణ ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్వీ నాయకులతో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అధికారం కోసం తప్పుడు వాగ్దానాలు చేసి, అధికారం చేపట్టాక కాంగ్రెస్ ప్రభుత్వం హామీలు అమలు చేయలేక తోక ముడిచింది అని ఎద్దేవా చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ పెంపు అని హామీ ఇచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మాట నిలబెట్టుకోలేదన్నారు. బీసీ సబ్ ప్లాన్ పెట్టి రూ.లక్ష కోట్లు కేటాయింపు, బీసీ కార్పొరేషన్ల ఏర్పాటు, ఒక్కో కార్పొరేషన్‌కు రూ. 100 కోట్లు కేటాయింపు ఏమైందని ప్రశ్నించారు. తప్పుల తడకగా ఉన్న కులగణన సర్వేపై సమీక్ష నిర్వహించాలని డిమాండ్ చేశారు. ప్రజా వ్యతిరేక విధానాలు మానుకోకపోతే రాబోయే రోజుల్లో భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో మల్లికార్జున్, వీరేష్, సత్యం, వీరేష్‌గౌడ్, అంజిర, మోహన్‌గౌడ్, శివన్న, అశోక్‌కుమార్, నరసింహులు, అశోక్‌గౌడ్, ప్రదీప్, పుణ్యమూర్తి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

'సమస్యకు ఆత్మహత్య పరిష్కారం కాదు'



మాట్లాడుతున్న వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర

ఉండవెల్లి: ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో మెలిగడంతో పాటు చదువుపై శ్రద్ధ వహించి ఉత్తమ ఫలితాలను సాధించాలని వందేమాతరం ఫౌండేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్ర అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని మనోరమ కల్యాణ మండపంలో 6 పాఠశాలలకు చెందిన 290 మంది పదో తరగతి విద్యార్థులకు ప్రేరణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు గ్రామాల నుంచి వచ్చే విద్యార్థులు ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని పాఠశాలకు వస్తారని, పట్టుదలతో చదివి ఉన్నత శిఖరాలు అధిరోహించాలని సూచించారు. ప్రతి విద్యార్థి భవిష్యత్‌లో ఓ దిక్సూచిగా తయారవ్వాలన్నారు. ఈ మధ్య విద్యార్థులు చిన్న విషయాలకే ఆందోళనకు గురై ఆత్మహత్య చేసుకుంటున్నారని, ప్రతి సమస్య ఆత్మహత్య పరిష్కారం కాదన్నారు. కార్యక్రమంలో వందేమాతరం ఫౌండేషన్ జిల్లా అధ్యక్షుడు చెన్నయ్య, మండల అధ్యక్షుడు రఘుయాదవ్, ఎంఈఓ రామకృష్ణ, ప్రధానోపాధ్యాయులు హేమలత, అనితాబాయి, ఉపాధ్యాయులు సుందర్‌రెడ్డి, మనోహర్‌రెడ్డి, మధు, రమణమ్మ, నరేష్, రజని కాంత్,సత్యనారయణ, కర్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతపై ఆరా



మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న ఎంఈఓ రవీంద్రబాబు



మల్దకల్ హైస్కూల్‌లో ప్రధాని సందేశాన్ని వీక్షిస్తున్న విద్యార్థులు

ధరూరు: విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలని మండల ఇన్‌చార్జ్ ఎంఈఓ రవీంద్రబాబు అన్నారు. సోమవారం మండలంలోని మన్నాపురం ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించారు. ఆహారం నాణ్యతపై ఆరా తీశారు. వంటలు శుచి, శుభ్రతతో వండాలని సూచించారు. రిజిస్టర్లను, స్టోర్ రూంలో వంట సరుకులను పరిశీలించారు. ప్రతి పాఠశాలలో 100 శాతం ఉత్తీర్ణత రావాలని, ప్రతి విద్యార్థికి అపార్ నంబర్ వచ్చేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమాల్లో ఉపాధ్యాయులు ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

మల్దకల్: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు ప్రతి విద్యార్థి క్రమశిక్షణతో చదువుకోవాలని ఇన్‌చార్జ్ ఎంఈఓ సురేష్ విద్యార్థులకు సూచించారు. సోమవారం మల్దకల్ జెడ్పీహెచ్‌ఎస్‌లో పదో తరగతి విద్యార్థులకు ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చిన సందేశాన్ని విద్యార్థులకు వినిపించారు. విద్యార్థులకు పదో తరగతి పరీక్షలు కీలకమని, ప్రత్యేక లక్ష్యంతో చదువుకొని ఉన్నత స్థానాలను చేరుకోవాలని ఆయన కోరారు. విద్యార్థుల తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఇంటి దగ్గర చదివేలా చర్యలు తీసుకోవాలన్నారు.

ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు

కొత్తకోట (ఆత్మకూర్): వ్యవసాయ రంగంలో కాలానికి అనుగుణంగా వచ్చే ఆధునిక వ్యవసాయంతో అధిక దిగుబడులు సాధించొచ్చని ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి తనయుడు అచ్యుత్‌రాంరాజ్ అన్నారు. సోమవారం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో మండలంలోని రైతులు, నాయకులతో సమావేశమయ్యారు. డ్రోన్‌ల ద్వార పంటలకు మందు పిచికారీ చేయిస్తే సమయంతో పాటు కూలీల ఖర్చు ఆదా అవుతుందని, అధిక దిగుబడులు సాధించొచ్చని అన్నారు. రైతులు ఆధునిక వ్యవసాయానికి అలవాటు పడాలని మార్కెట్లో డ్రోన్స్లు, ఇతర పరికరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. కార్యక్రమంలో రహ్మతుల్లా, పరమేష్, తులసీరాజ్, గద్దం శ్రీనివాస్ యాదవ్, జుబేర్, గణేష్, దామోదర్, అశోక్, హరీష్‌గౌడ్, శాలం, జమాల్, రఫీ, గద్వాల శ్రీను, జహంగీర్, రాఘవేంద్ర తదితరులు ఉన్నారు.